# సుజాత

సుజాత తండ్రి ఉద్దాలక మహర్షి చెంతకు వచ్చి పళ్ళు, గోక్షీరపాత్ర దగ్గర ఉంచింది. ప్రేమతో ఆమె శిరసు నిమిరి, పక్కన కూర్చోబెట్టుకున్నాడు మహర్షి.

సుజాత రాక వేదాధ్యయనానికి కొంత అంతరాయం కల్గించింది. అధ్యయనం చేస్తున్న శిష్యుల చూపులు గురుగుగారి వైపు, ఆయన గారాలపట్టి సుజాత వైపు మళ్ళాయి. అయితే గురువుగారి వైపు చూసే చూపులు భక్తి గౌరవాలతో నిండి ఉన్నాయి. సుజాత వైపు ప్రదర్శించే చూపులు భయం భయంగా, చూసీ చూడనట్లుగా, దొంగ చూపుల్లా ఉన్నాయి. అక్కడున్న శిష్యు లందరిలో ఏకపాదుని చూపుల్లో ఒక ప్రత్యేకత ఉంది. గురువుగారి పట్ల భక్తితత్పరత, సుజాత. ఎడల నిర్లిప్తత, నిర్వికారత కనిపిస్తున్నాయి.

ఉద్దాలక మహర్షికి తెలుసు- సుజాతకి తన శిష్యులు వేదాధ్యయనం చేస్తున్నపుడు చెంత ఉండటం ఇష్టమని. అందుకే గోక్షీరం తెచ్చిన సుజాతను అక్కడే కూర్చోబెట్టుకున్నాడు.

శిష్యులు అధ్యయనం తిరిగి ప్రారంభించారు. గురువుగారి నోటి వెంట వచ్చే ప్రతి స్వరాన్ని, శబ్దాన్ని వెంటనే మననం చేసుకుంటూ, ఏ పొరపాటూ రాకుండా చెప్పగలవాడు అందరిలో ఒక్క ఏకపాదుడే. గురువు ముఖతః వచ్చిన ఏ స్వరమైనా మరుక్షణంలో అతని స్వంతమయ్యేది. ఈ బాలుడు ఏకసంథాగ్రాహి అనే భావం ఎన్నోసార్లు ఉద్దాలకునికి కలిగేది.

మహర్షి స్వభావం సరళమైంది. మనసు సున్నితమైంది. ఏ రకమైన జీవహింసనూ సహించలేని సాత్త్వికుడు ఈ జగత్తులో సర్వ ప్రాణులకు సుఖంగా జీవించే అవకాశ ముండాలని విశ్వసించే విశాల హృదయుడు. ఆయన తన శిష్యులకు ఏ నిర్బంధాలూ విధించేవాడు కాడు. అవసరమైన నియమాలు సూచన ప్రాయంగా తెల్పేవాడు.

ఏకపాదుడు స్వయంగా నియమనిష్ఠ లేర్పరుచుకొని, బహు శ్రద్ధగా అధ్యయనం చేయటం ఉద్దాలక మహర్షి గమనించాడు. ఏకపాదుని గుణగణాలు, శీల సంపద అతన్ని గురువుకి సన్నిహితుణ్ణి చేశాయి.

పది సంవత్సరాలు నిండక మునుపు నించే తండ్రి దగ్గర కూచుని, ఆయనకు సేవలు చేస్తూ, వేదాధ్యయనాన్ని చాలా శ్రద్ధగా వినటం అలవాటు చేసుకుంది సుజాత. తండ్రి దగ్గర కూర్చున్నాక ఆమె దృష్టి అంతా ఏకపాదునిపై ఉండేది. అతడు శబ్దాలు ఉచ్చరిస్తుంటే అతని పెదాలవంక చూస్తుండేది. అతని నిత్యకృత్యాన్ని క్షణ క్షణం గమనించటం ఆమె దినచర్యలో భాగమయింది.

ఋతువులు మారుతున్నాయి. సంవత్సరాలు గడుస్తున్నాయి. సుజాత పెరుగుతోంది. ఏకపాదుడు యువకు డవుతున్నాడు. ఏకపాదుని చూడటం కోసమే అన్ని పనులూ త్వరగా పూర్తి చేసుకుని తండ్రి దగ్గరకు చేరేది. సుజాత రాక ఆలస్యమైతే అతని చూపులు ఆమె కోసం వెతికేవి.

కాని ఏకపాదుడు బ్రహ్మచర్య దీక్షాపరుడై, వేదాధ్యయనం ధ్యేయంగా పెట్టుకుని, మనసుని లొంగదీసుకుని, అధ్యయనంపైనే దృష్టి నిల్పాలని శత విధాల ప్రయత్నం చేసేవాడు.

ఆనాడు తండ్రి చెంగట కూచున్న సుజాత పైన నుంచి అతని చూపు ఎంత ప్రయత్నించినా మరల లేదు. ఆమెను ఆపాదమస్తకం పరిశీలనగా చూశాడు. నిన్నటి వరకు బాలికగా ఉన్న ఆమె అంతలోనే నూత్న యౌవనంలో అడుగు పెట్టినట్టనిపించింది ఏకపాదునికి. ఆమె శరీరం బంగారంలా మెరిసిపోతోంది అమాయకంగా ఉండే ఆమె నయనాలు కొత్త సోయగాలు నింపుతున్నాయి. ఆమె శరీరంలోని వంపులు వింత ఆకర్షణ కలిగిస్తుంటే, ఏకపాదుడు చాలా కష్టంపైన చూపులు గురువుగారి పైన ప్రసరించాడు.

విరామానంతరం, ఏకపాదుడు తన చిత్తాన్ని అధ్యయనం మీదికి కేంద్రీకరించటం ఉద్దాలకుడు గమనిస్తూనే ఉన్నాడు. అతని ఏకాగ్రతకి మహర్షి ఎంతో ఆనందపడ్డాడు.

ఏదో పని కల్పించుకుని తండ్రి దగ్గరికి రాకపోకలు సాగించే సుజాత, ఏకపాదుని వైపు చూడకుండా ఉండలేకపోయింది. అతనిలో కొత్తగా ప్రవేశిస్తున్న యౌవనపు ఆకర్షణకి ఆమె తట్టుకోలేకపోతోంది. అతని శరీరంలో

ప్రవేశించిన దారుఢ్యం, ముఖంలో కనిపిస్తున్న వర్చసు, గొంతులోని గంభీరత, అతని కొనదేలిన నాసిక, అతని ఆత్మ విశ్వాసం - ఇలాంటి వెన్నెన్నో సుజాత ఏకపాదునిలో గమనిస్తూనే ఉంది దినదినం. అతని చూపులు ఆయస్కాంతాల్లా ఆమెను పట్టి బంధిస్తుంటే, సిగ్గుతో తల వంచుకుని, నేల చూపులు చూస్తూ, అక్కడే నిలబడిపోయింది సుజాత. ఏనాడైనా అధ్యయన దీక్షలో ఉండి ఏక పాదుడు ఆమెను గమనించకపోతే సుజాతకి కోపం వచ్చేది. అప్పుడు అలాగే నిలబడేది. కాని, మరుక్షణంలో కోపాన్ని మరచిపోయి, అతని క్రమశిక్షణని మెచ్చుకొనేది మనసులో. అతని నూనూగు మీసాలనీ, నిండైన కంఠాన్ని, విశాల మైన వక్షస్థలాన్ని, తీక్షణమైన అతని నేత్రాలను, వేదోచ్చారణ సమయాన కదిలే అతని పెదవులను చూస్తూ పరవశించేది సుజాత.

సుజాత, ఏకపాదుల మనోభిప్రాయాలని చాలా తేలికగా అవలోకించగల్గిన ఉద్దాలక మహర్షి నెరిసిన గడ్డాన్ని సవరించుకుంటూ చిరునవ్వు నవ్వుకున్నాడు. అమాయకమైన, పవిత్రమైన వారి ప్రేమ, అన్యోన్యాకర్షణ మహర్షికి మహదా నందాన్ని కల్గించింది.

అందరికంటె మిన్నగా ముందుగా అధ్యయనం పూర్తి చేసిన ఏకపాదుడు బ్రహ్మచర్యం కొనసాగించవలసిన అవసరం ఇక లేదని మహర్షి నిర్ణయించాడు.

ఓ శుభోదయాన ప్రాతఃసంధ్యా కార్యక్రమాలు పూర్తి అయిన తర్వాత ఏకపాదుని పిలిచాడు మహర్షి. "నాయనా, నీ అధ్యయన కార్యక్రమం పూర్తి అయింది. గురుకులం విడిచి, స్వతంత్రంగా నీవే గురుత్వం వహించే అర్హత సంపాదించుకున్నావు. నీవు కోరుకున్నప్పుడు బ్రహ్మచర్యం వదలి, గృహస్థా శ్రమం స్వీకరించు."

ఏకపాదుడు భక్తితో, వినయంతో గురువుకు పాదాభివందనం చేశాడు.

అదే సమయంలో తన మనసులోనిమాట చెప్పాలని నిశ్చయించాడు మహర్షి.

"నీకు సమ్మతమయితే, మా సుజాతకి తగిన వరుడవు నీవేనని నా నమ్మకం."

గురువుగారి మాటలకు ఏకపాదుడు మహదానందపడ్డాడు. అంతేకాదు, తన మనసు గురువు గ్రహించేసినందుకు, అతనికి ఎంతో ఆనందమేకాక, ఆశ్చర్యం కూడా కల్గింది. తండ్రీ ఏకపాదుల సంభాషణ గుమ్మం వెనక ఉండి వింటున్న సుజాత రివ్వున లేచి పరిగెత్తి నుదుటి చెమట తుడుచుకుంది.

గురువుగారి మాటకు సమాధాన మీయకుండా, నేల చూపులు చూస్తున్నాడు ఏకపాదుడు. ఇప్పటివరకూ కట్టుదిట్టాలతో బంధించిన మనసు స్వతంత్రమై, సుజాత వైపు పరుగులు తీసింది. ఆమెను స్పృశించాలని, ఆమె కురులు సరిచేయాలనీ, ఆమెను తన కౌగిలిలో బంధించాలని అతని మనసు ఆవేశపడుతుంటే గురువుగారికి వెంటనే తన అభిప్రాయం చెప్పాలని తల ఎత్తేడు ఏకపాదుడు.

"ఏకపాదా, నీ అభిప్రాయం—" చిరునవ్వు నవ్వాడు మహర్షి.

"తమరిమాట నాకు శిరోధార్యమే"—ఏకపాదుడు గురువు పాదాలకు నమస్కరిస్తూ అన్నాడు.

తన మనసు గ్రహించిన తండ్రిని చూస్తుంటే, సుజాత ఆనందం పట్టలేక, పరుగెత్తి వచ్చి ఆతని పాదాలపైన వ్రాలింది.

సుజాత సౌందర్యాన్ని నఖశిఖ పర్యంతం పరికిస్తూన్న ఏకపాదుని వంక క్రీగంట చూస్తూ, అతని ధర్మపత్నిగా ఊహలు అల్లుకుంటూ, సిగ్గుతో తల వంచింది సుజాత.

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం : అరణ్యపర్వం : తృతీయాశ్వాసం.)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక : 18-5-1988)